క్లుప్తంగా

అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

కొండపి(సింగరాయకొండ): ఓ గది లో నిల్వ ఉంచిన విద్యుత్ పరికరాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెట్లూరు గ్రామ శివారులో ఓ గృహంలో వ్యవసాయ కనెక్షన్‌ల కోసం వినియోగించే విద్యుత్ పరికరాలు కొన్ని నెలల తరబడి ఉండండతో స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారి ఏడీఏ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్ తనిఖీలు చేశారు. కొండపి ఏఈ కోటయ్యను పరికరాలు నిల్వ ఉన్న ప్రాంతానికి పిలిపించి పరిశీలించారు. అనంతరం గృహ యజమానిని పిలిపించి వివరాలు అడగా..కాంట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలని తెలిపారు. అనంతరం సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడగా కట్టవారిపాలెంలో పనులు జరుగుతున్నాయని, వాటికి సంబంధించి మిగిలిన వస్తువులు ఇక్కడ భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

మధ్యాహ్నం భోజనంపై అవగాహన


పొన్నలూరులో మధ్యాహ్నం భోజనంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొన్నలూరు: స్థానిక విద్యా వనరుల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం భోజనంపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వంట మనిషి, సహాయకులకు శిక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 తన్నీరు హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారు చేస్తున్న వంట మనిషి, సహాయకురాలు పరిశుభ్రంగా ఉండి విద్యార్థులకు భోజనం తయారు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన రోజు వారి మెనూ ప్రకారం క్రమం తప్పకుండా రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సీఆర్పీలు మధుబాబు, సలోమాన్, బాలకోటయ్య, ఖాదర్ బాష, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొండపి(సింగరాయకొండ): ప్రతి విద్యార్థి వేసవిలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కోరారు. విద్యార్థులు ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో డ్యాన్స్, కుర్చీలాట నిర్వహించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయంలో పోటీలు నిర్వహిస్తున్నారు. 46 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో విజ్ఞాన పుస్తకాలు చదివించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్వీన్

కనిగిరి రూరల్: కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమావళి, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాలపర్తి జాన్ ఇర్వీన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో పి.జాన్ ఇర్వీన్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ 4వ తేదిన 6 గంటల లోపు కౌంటింగ్ కేంద్రాలకు వద్దకు రావాలని తెలిపారు. 14 టేబుళ్లలో, 22 రౌండ్‌లలో లెక్కింపు పూర్తి అవుతుందని వివరించారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందచేశారు. డీఏఓ కృష్ణారావు, రమేష్, తేజ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


దద్దాల నారాయణను, పార్టీ నేతలను సన్మానిస్తున్న కొత్తూరు ఆలయ కమిటీ


కొత్తూరు ఆలయంలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్


కొత్తూరు పూజలు చేస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్

అంజనిపుత్ర పాహిమాం..


సీఎస్‌పురం: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి మూలవిరాట్


కందుకూరు విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

● భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

సింగరాయకొండ: మండలంలోని హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమరాజుపల్లి పంచాయతీ సాయినగర్ లో ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ ఆధ్వర్యంలో ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాకనాటి సుబ్బారెడ్డి, శేషమ్మ దంపతులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. మండలంలోని కలికవాయ, కనుమళ్ల, బింగినపల్లి, ఆంజనేయనగర్, తదితర ఆలయాల్లో జయంతి వేడుకలు చేశారు.

ఎమ్మెల్యే బుర్రా ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: హనుమజ్జయంతి సందర్భంగా కొత్తూరులో అభయాంజనేయ స్వామి గుడిలో కనిగిరి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది మాచవరపు సుబ్రహ్మణ్యం, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ముండ్లమూరివారిపాలెం అడ్డ రోడ్డు వద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో ఆకుపూజ, సింధూరాభిషేకం, సహస్రనామం నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

గుడ్లూరు: అంజని పుత్రుడు, శ్రీరామబంటు అంజనేయ స్వామి జయంతి వేడుకలను మండలంలో గనంగా నిర్వహించారు. గుడ్లూరులోని పెద్ద చెరువు వద్ద ఉన్న ప్రసన్నాంజనేయ ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. తమలపాకులతో విశేష పూజలు చేశారు. మిట్టపాలెం విష్ణాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న అభయాంజనేయ ఆలయంలో, చెమిడిదిపాడు వద్ద హనుమాన్ ఆలయంలో వివిధ పూజలు చేశారు.

ఉలవపాడు: హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉలవపాడులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూలమాలలు వేసి పూజలు చేశారు. తీరప్రాంత గ్రామాలైన కరేడు, చాకిచర్ల, అలగాయపాలెం, సుబ్బరాయుడు సత్రం, పెదపట్టపుపాలెం, రామాయపట్నంలోని మత్యకార గ్రామాలలో ప్రధానంగా పూజలు చేశారు.

కందుకూరు: హనుమజ్జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని విఘ్నేశ్వర, వైనతేయ, హనుమత్ ఆలయంలోని స్వామివార్లకు పంచామృత అభిషేకం, విశేష అలంకారం, వడలమాలధారణతో కనులపండువగా అలంకరించారు. హనుమాన్ చాలీసా పారాయణం పఠిస్తూ తమలపాకులతో స్వామికి అర్చన చేశారు. తల్లపనేని పెరుమాళ్లనాయుడు, జమ్మలమడక సుబ్రమణ్యం, అత్తింటి మాల్యాద్రి, మన్నేపల్లి వరప్రసాదరావు, ఆలా మోహన్‌రావు, కోటేశ్వరరావు, ఆలయ అర్చకులు గుంటూరు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): హనుమజ్జయంతి వేడుకలను సి.నాగులవరంలోని వీరభద్ర వీరఆంజనేయస్వామి ఆలయం, కోవిలంపాడుతో పాటు పలుగ్రామాల్లో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు పద్మనాభయ్య, జొన్నాబొట్ల వెంకటతేజలు ఆంజనేయస్వామి మూల, ఉత్సవ విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. సర్పంచ్‌లు మర్రి రామయ్య, ముప్పాళ్ల సరోజమ్మ, ఆలయ చైర్మన్ మూరం మురార్జి, వేల్పుల నారాయణయాదవ్, ముప్పాళ్ల వసంతరాజు, భక్తులు పాల్గొన్నారు.

పామూరు: హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మదన వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంతో పాటు మండలంలోని ఇనిమెర్ల, మోపాడు, బొట్లగూడూరుతో పాటు పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉత్సవమూర్తికి ఆకుపూజ, సింధూరపూజ, కథలి, చందన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నారాయణం సత్యబాబు, ఆలయ ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ పశుపులేటి రఘురాం, భక్తులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు, వివిధ గ్రామాల్లో గల ఆంజనేయ, అభయాంజనేయ, వీరాంజనేయుని స్వామి దేవస్థానాల్లో విశిష్ట పూజలు చేశారు. పట్టణంలోని రామాలయం వీధి, హనుమాన్ భజన సంఘం, శంఖవరం, కోదండరామ స్వామి, కొత్తూరు ఆలయాల్లో ఉన్న జనేయునికి ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ రామ భక్త ఆంజనేయుని ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో, ఆనందంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కొత్తూరులో అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానాన్ని డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ దద్దాల నారాయణను, వైఎస్సార్ సీపీ నేతలను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ మహిళా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సుజాత, చింతం శ్రీను, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


పామూరు: విశిష్ట అలంకరణలో అభయ ఆంజనేయస్వామి


ముండ్లమూరివారిపాలెం అడ్డరోడ్డు వద్ద ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి దేవాలయం


పూజల్లో పాల్గొన్న భక్తులు

బాధ్యతగా విధులు నిర్వర్తించండి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని నిలదీసిన ప్రజా ప్రతి నిధులు

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ గాయం సావిత్రి అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో శాఖ అధికారులతో సమస్యలపై చర్చించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు విద్యుత్ అధికారులు రైతులకు విద్యుత్ సమస్యలపై తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించి పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ప్రజాసమస్యలు పట్టించుకోని అధికారులు

కంభం కనిగిరి రోడ్డు మోకాటి లోతు గుంతలు పడి అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు వెంకటసుబ్బయ్య, తానిగుండాల తిరుపతిరెడ్డి, సర్పంచులు సానికొమ్ము బ్రహ్మారెడ్డిలు ఆర్అండ్‌బీ అధికారులను నిలదీశారు. సాగర్ జలాలు సరఫరా కావడం లేదని, దొడ్డిచింతలలో గత నాలుగేళ్ల నుంచి ట్యాంకుకు చుక్కనీరు ఎక్కించలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. పైపులు లీకై వృథాగా నీరు పోతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ అధికారులను స్తంభాల గురించి నాలుగేళ్ల నుంచి అడుగుతున్నా చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ కె.లలితలు అధికారులకు సూచించారు. ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ కేవీ కె.లలిత, వైస్ ఎంపీపీలు రుద్రపాటి శోభ, కోదమల బెంజి, వైస్ ఎంపీపీ, ఏఓ క్రిష్ణారావు, సర్పంచ్ కత్తిరాజారావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తాం


వల్లూరులో సర్వే చేస్తున్న ఎంఈఓ-2


ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంఈఓలు

సీఎస్‌పురం(పామూరు): దివ్యాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓలు జె.ప్రసాదరావు, ఆర్ కొండారెడ్డి తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు బడిలో నమోదుకాని దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని తగిన తరగతిలో చేర్చేందుకు ఐఈఆర్‌పీల ద్వారా ప్రభుత్వం మండలంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా సీఎస్‌పురంలో నిర్వహిస్తున్న సర్వేను వారు పర్యవేక్షించి సర్వేలో అనుసరించాల్సిన విధానాలను సిబ్బందికి సూచించారు. మండలంలో ఇప్పటి వరకు కొత్తగా 25 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇంకా మాటలురాని పిల్లలు, వినికిడి లోపం కలిగిన, మందబుద్ధి కలిగిన పిల్లలతో పాటు వివిధ రకాల ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఉంటే ఐఈఆర్‌పి టీచర్లకు తెలియజేయాలన్నారు. ఐఈఆర్‌పీలు వి.వెంకట్రావు, కె.రంజిత్ పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని ఎంఈఓ–2 తన్నీరు బాలాజీ తెలిపారు. మండలంలోని ఆలకూరపాడు, వల్లూరు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ప్రత్యేక అవసరాలు ఉన్న 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి వారిని రిజిష్టర్ చేసి స్థానిక పాఠశాలల్లో గానీ, పురం సెంటర్‌లోని భవత కేంద్రంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. ఇప్పటికి వరకు మండలంలో 30 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి


మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం మండలంలోని మధ్యాహ్నభోజన నిర్వాహకులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వం రోజువారీ నిర్దేశించిన మెనూని కచ్చితంగా అమలుచేయాలన్నారు. పౌష్టికాహారం లోపించి విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే పరిస్థితులు రాకుండా ఉండేందుకు గోరుముద్ద పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. మెనూ పాటించడం, చిక్కీలు, కోడిగుడ్డు భోజనంతోపాటు విద్యార్థులకు ఇవ్వాలన్నారు. సీఆర్‌పీలు సతీష్, ప్రవీణ్, ఐఈఆర్‌పీలు, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యార్థులకు పరిశుభ్రంగా, రుచికరంగా పోషక విలువలతో కూడిన భోజనం వండాలని ఎంఇఓ బి. నాగేంద్రవదన్ కుకింగ్ ఏజెంట్లకు సూచించారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కుకింగ్ ఏజెంట్లు, హెల్పర్లకు పోషకవిలువలతో కూడిన రుచికరమైన భోజనం ఏవిధంగా వండాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుకింగ్ ఏజెంట్లకు రుచికరమైన భోజనం వంటకంపై పోటీలు నిర్వహించారు. ఎంఇఓ–2 డోలా శ్రీనివాసరావు కుకింగ్ ఏజెంట్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


వంటకాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

నీటి సమస్య పరిష్కారంపై దృష్టి


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మున్సిపాలిటీలోని 8వ వార్డు ఉప్పు రోడ్డులో శనివారం సమస్య పరిష్కారంలో భాగంగా చైర్మన్ గఫార్, కౌన్సిలర్ షఫీ జాస్మిన్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి సమస్యను చైర్మన్ దృష్టికి తెచ్చారు. కుళాయిల ద్వారా నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీంతో స్పందించిన చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వేసవి తీవ్రతతో భూగర్భజలాలు అడుగంటాయని, తత్ఫలితంగా బోర్లల్లో నీర్లు అడుగంటినట్లు తెలిపారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఏఈ, వాటర్ లైన్‌మన్లతో మాట్లాడారు. ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, మాజీ వార్డు సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్, గురుస్వామి, చుండూరి సత్యన్నారాయణ, కంచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


తిమ్మారెడ్డిపల్లిలో నిమ్మ తోటలు పరిశీలిస్తున్న అధికారులు

హనుమంతునిపాడు: నిమ్మ తోటలు సాగు రైతులు తప్పనిసరిగా నీటియాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవణ శాఖ అధికారిని అంజలీబాయి అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో సాగులో ఉన్న నిమ్మతోటలను శనివారం పరిశీలించారు. నిమ్మతోటలకు ఎండుపుల్ల, వేరుకుళ్లు, కాయమంగు, మాను తెగులు, బంక తెగులు, ఆకుమడత ఉన్నట్లు గుర్తించారు. రైతులతో మాట్లాడుతూ నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే వేసవిలో నిమ్మ తోటల నుంచి నాణ్యమైన దిగుబడిని పొందవచ్చన్నారు. పూత, పిందె, కాయ దశలో ఉన్న తోటలకు క్రమం తప్పకుండా తగినంత నీరు అందించాలన్నారు. డ్రిప్ ద్వారా నీరు ఆదాతోపాటు చెట్టుకు వేరుకుళ్ల తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఆరుదలను గమనిస్తూ క్రమ పద్ధతిలో చెట్లకు నీటిని అందించాలన్నారు.